




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 109 సోమవారం 21-04-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


# హైదరాబాద్‌లో ఎకో టౌన్

**- జపాన్‌లోని కిటాక్యుషు మాదిరిగా భాగ్యనగరం - భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం**

**- పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: రేవంత్ - కిటాక్యుషు నగరాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి**

**- జపాన్ సంస్థలతో తెలంగాణ సర్కారు ఒప్పందం - హైదరాబాద్‌లో జపనీస్ పాఠశాల ఏర్పాటు యోచన**



**హైదరాబాద్, ఏప్రిల్ 20:** హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తం చేశారు. సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదని, అవసరమని అన్నారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితోపాటు పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం పర్యావరణహిత కిటాక్యుషు నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకోనుంది. కాగా, కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టేకుచితో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర నమూనాలు, నదుల పునరుజ్జీవ విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్పీ, నిప్పాన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు సీఎం సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై తెలంగాణ ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యుషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేకుచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు.

**పెట్టుబడులకు అనువైన వాతావరణం..**

పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితోపాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్–కిటాక్యుషు నగరాల మధ్య విమాన ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయాలనే అంశం చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాష పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువశక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కల్పిస్తే.. అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవ ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది.. పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు సీఎం రేవంత్ బృందానికి కిటాక్యుషులో స్థానిక సంప్రదాయ రీతిలో స్వాగతం లభించింది.

**నిర్బంధం బద్దలైంది.. ఇంద్రవెల్లి రెక్కలు విప్పుకొంది: రేవంత్**

జల్.. జంగిల్.. జమీన్ అంటూ హక్కుల కోసం పోరాడి, అసువులు బాసిన అడవి బిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. వారి పోరాటం సదా స్ఫూర్తిదాయకమన్నారు. ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్దలైంది. ఇంద్రవెల్లి స్వేచ్ఛగా రెక్కలు విప్పుకొంది. నాకు అండగా నిలిచి.. ఇంద్రవెల్లి కొండల్లో దండోరా మోగించిన ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా తీసుకున్న నిర్ణయం స్వేచ్ఛ" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## కర్ణాటక మాజీ డీజీపీని
# చంపేసిన భార్య

**ముఖంపై కారం కొట్టి.. కత్తితో దాడి**

**ఓంప్రకాశ్‌ని చంపేశానంటూ మరో ఐపీఎస్ భార్యకు ఫోన్ చేసిన వైనం**

**హత్యలో కుమార్తెకూ భాగస్వామ్యం**



**బెంగళూరు, ఏప్రిల్ 20:** కర్ణాటక మాజీ డీజీపీ ఓంప్రకాశ్(68) దారుణ హత్యకు గురయ్యారు. బెంగళూరు నగరం హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఆయన నివాసంలోనే ఈ దారుణం జరిగింది. భార్య పల్లవి, కుమార్తె కృతి ఆయనను ముఖంపై కారం చల్లి కత్తితో పొడిచి చంపేసినట్టు తెలుస్తోంది. అనంతరం పల్లవి మరో ఐపీఎస్ అధికారి భార్యకు వీడియోకాల్ చేసి, రాక్షసుడిని చంపేశానంటూ మృతదేహాన్ని చూపించినట్టు సమాచారం. ఆస్తి తగాదాలే హత్యకు కారణంగా తెలుస్తోంది. పల్లవి ఆదివారం సాయంత్రం ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా హెచ్ఎస్ఆర్ లే అవుట్ పోలీసులు ఆయన ఇంటికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. భార్య, కుమార్తెను బయటకు రావాలని పోలీసులు కోరినా చాలా సమయంపాటు వారు పైఅంతస్తులోనే ఉండడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. బిహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్ 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తొలుత బళ్లారి జిల్లా హరపనహళ్లిలో ఏఎస్పీగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి 2015 నుంచి 2017 వరకు కర్ణాటక డీజీపీగా వ్యవహరించారు. రిటైర్మెంట్ తర్వాత బెంగళూరులోనే నివసిస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవని ఇరుగు పొరుగువారు పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

# చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

**ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం**

**సాధారణ బాంబు తరహాలోనే.. అయినా తీవ్ర విధ్వంసం సృష్టించే సామర్థ్యం**

**బాంబు పేలినప్పుడు కొన్ని సెకన్ల పాటు భారీ అగ్నిగోళం**

**1000 డిగ్రీలకుపైగా వేడితో వినాశనం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత ను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది. రెండు కిలోల మెగ్నీషియం హైడ్రైడ్ వినియోగించిన పేలుడు పరికరాన్ని.. నియంత్రిత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో పరీక్షించినట్టు వెల్లడించింది. పేలుడు సమయంలో రెండు సెకన్ల పాటు 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతతో కూడిన అగ్నిగోళం ఏర్పడిందని.. అది సంప్రదాయ టీఎన్‌టీ పేలుడు కంటే 15 రెట్లు ఎక్కువని వివరించింది.

# పేరుకే ముగ్గురు మంత్రులు అభివృద్ధి శూన్యం

**ఖమ్మంలో మంత్రుల మధ్య ఆధిపత్య పోరు: కవిత**



**ఖమ్మం, ఏప్రిల్ 20:** ఖమ్మం జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రితో పాటు ఇద్దరు మంత్రులున్నా వారి మధ్య ఆధిపత్య పోరు తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని, అకాల వర్షాలతో జరిగిన పంట నష్టంపై కనీసం సమీక్షించలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఖమ్మంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే సీఎం కనీసం రెవెన్యూ అధికారులతో మాట్లాడలేదన్నారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.20 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సోనియా, రాహుల్‌పై ఈడీ కేసులు నమోదు చేస్తే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు చేపట్టిందని, కానీ.. సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం కనీసం ట్విట్టర్‌లో పోస్టు పెట్టేందు కూ తీరిక లేకుండా పోయింద న్నారు. బీఆర్ఎస్ హయాంలో భక్తరామదాసు ప్రాజెక్టు పూర్తిచేసి వేల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కొత్త ప్రాజెక్టు చేపట్టలేదన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మం నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

# ఆ అధికారిని రిటైరయ్యాక కొనసాగించండి

**- సీఎం రేవంత్‌కు ఓ కీలక శాఖ మంత్రి లేఖ - ఈ నెల 30న రిటైరవుతున్న సదరు ఎస్ఈ**

**హైదరాబాద్, ఏప్రిల్ 20:** ఉద్యోగ విరమణ తర్వాత ఆయా శాఖల్లో కొనసాగుతున్న, కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగే వారిని ప్రభుత్వం తొలగిస్తోంది. అయితే ఓ కీలక శాఖలో పూర్తి అదనపు బాధ్యతల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పనిచేస్తున్న అధికారిని రిటైరయ్యాక కూడా కొనసాగించాలంటూ ఓ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. తన శాఖకు అనుబంధంగా ఉండే ఓ విభాగానికి ఎస్ఈగా ఉన్న సదరు అధికారి ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్నారని, అయితే ఆ విభాగంలో ఇంకా నిర్వహించాల్సిన పనులు చాలా ఉన్నాయని, అందులో ప్రభుత్వం "సూపర్ గేమ్ చేంజర్"గా భావిస్తున్న ప్రాజెక్టు కూడా ఉందని లేఖలో తెలిపారు. ఆయా పనులను సక్రమంగా, వేగంగా జరిపేందుకు సదరు అధికారి అవసరమని, పదవీ విరమణ తర్వాత కూడా శాఖలో ఆయన కొనసాగేలా అవకాశమివ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్టులు ఆశించిన సమయానికి పూర్తయ్యేందుకుగాను ఢిల్లీ అ?ధికారులతో పరిచయమున్న ఈ అధికారి అవసరమని తెలిపారు. ఏడాదిపాటు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ ఈ నెల 8న మంత్రి లేఖ రాయగా తాజాగా అది వెలుగులోకి వచ్చింది. సీఎం ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నందున దీనిపై ఆయన ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. రిటైరైన వాళ్లను ప్రభుత్వం వద్దని పంపిస్తుంటే మంత్రి ఇలా సీఎంకు లేఖ రాయడం పట్ల శాఖలో చర్చ జరుగుతోంది.

## కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో “సీపీఎస్ రద్దు హామీ

# అమలుకై ఒత్తిడి పెంచుతా”

## ఉపాధ్యాయుల గొంతుకై నిలబడతా..

**సమగ్ర శిక్ష అభియాన్ మరియు లెక్చరర్ల సమస్య పరిష్కారం కోసం పాటు పడుతాను**

**నా గెలుపు కోసం కృషి చేసిన మహబూబాబాద్ పి ఆర్టియు శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు**

**ఎమ్మెల్సి పింగిలి శ్రీపాల్ రెడ్డి**

“సిపిఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రద్దయ్యే వరకు శక్తి వంచన లేకుండా పోరాడుతానని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు వరంగల్ ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీ శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా పిఆర్టియు మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం స్థానిక బాలాజీ గార్డెన్స్ లో నిర్వహించారు. ముందుగా మహబూబాబాద్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బాలాజీ గార్డెన్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పి ఆర్టియు మహబూబాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు సంకా బద్రి నారాయణ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్ రెడ్డి సమన్వయంతో ఆత్మీయ అభినందన సన్మానోత్సవాన్ని నిర్వహించారుద. లిఈ సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ గజమాలతో, శాలువాతో, మెమొంటోలతో ఘనంగా సన్మానం నిర్వహించడం జరిగింది ఈ సన్మాన అనంతరం సమావేశంలో సన్మానం అందుకున్న వరంగల్ ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గారు మాట్లాడారు..”



**తొలి సమయం, మహబూబాబాద్ ఏప్రిల్ 20:**
ఉపాధ్యాయుల గొంతుకై ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా కాకుండా ఉపాధ్యాయ సమస్యలే ఎజెండాగా పనిచేస్తాను అన్నారు. ఎమ్మెల్సీ ఎలక్షన్స్ ప్రచారంలో భాగంగా ఇచ్చినటువంటి ప్రతి ఒక్క హామీని నెరవేర్చడానికి కృషి చేస్తానని అన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వానికి పలు సూచనలు చేసి విద్యా వ్యవస్థ






పటిష్టతకు పాటుపడతానని అన్నారు. ప్రజా ప్రభుత్వం గా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఎలెక్షన్ మేనిఫెస్టో లో హామీ ఇచ్చినట్లుగా సిపిఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రద్దు చేసేటట్లుగా తన వంతు కృషి చేస్తానని అన్నారు ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ తో నూతన హెల్త్ స్కీమ్ కి కృషి చేస్తాననిఅన్నారు, ప్రతి సంవత్సరం మే లో ప్రమోషన్లు బదిలీలు నిర్వహించే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని, అదేవిధంగా పెండింగ్ లో ఉన్నటువంటి సమస్యలు డిఏలు మరియు పిఆర్సి నివేదిక ఆధారంగా మంచి ఫిట్మెంట్ ఇప్పిచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని, వీటితోపాటుగా కేజీబీవీ లలో మోడల్ స్కూల్ లలో పనిచేసేటువంటి ఉపాధ్యాయుల యొక్క సమస్యల పరిష్కారం కోసం పాటు పడతానని, సమగ్ర శిక్ష అభియాన్ మరియు లెక్చరర్ ల సమస్య పరిష్కారం కోసం పాటుపడతానని వీటితో పాటుగా ప్రైవేటు పాఠశాలలో పనిచేసేటువంటి ఉపాధ్యాయులకు కూడా హెల్త్ కార్డులు ఇప్పిచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు నా గెలుపు ఉపాధ్యాయుల గెలుపు అని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఉపాధ్యాయుల కోసమే పనిచేసేటువంటి సంఘం %ూ=ఖ% అని సంఘటితంగా చాటిచెప్పిన ఉపాధ్యాయ లోకానికి దీనికోసం కృషి చేసిన మహబూబాబాద్ జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గ సభ్యులకు ప్రాథమిక సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా నామినేషన్ నుండి గెలుపు వరకు ప్రస్తుతం కూడా ఉపాధ్యాయుల కోసం పనిచేసే సంఘం పిఆర్టియు అన్నారు నా గెలుపుకోసం కృషి చేసిన ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా మిత్రులకు కూడా ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లాలోని 18 మండల శాఖలు శ్రీపాల్ రెడ్డి ని ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ టి ఓఉపాధ్యక్షురాలు గీత, హన్మకొండ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు వై వి రావు ,ఆర్ యాకయ్య ,రఫీ శ్రీనివాస్,నాగిరెడ్డి మరియు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు వివాహ శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను

# ఆశీర్వదించిన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**తొలిసమయం, ఇల్లందు ఏప్రిల్, 20.**
కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలోత్ శివ సోదరుడు కోటేష్-రేవతి ల వివాహం నకు, కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన -చల్ల నరసింహారావు -కరుణమ్మ దంపతుల కూతురు పూజిత వెంకటేష్ ల వివాహానికి,కామేపల్లి మండలం పొన్నేకల్లు గ్రామానికి చెందిన కొయ్యడ తిరుమలి=పద్మ దంపతుల కుమారుడు వేణు,వరలక్ష్మి ల వివాహానికి మరియు. నేలకొండపల్లి మండలం భైరవుని పల్లి గ్రామానికి చెందిన పూజల రమణ -భాగ్యమ్మ ల కుమారుడు ప్రశాంత్, దీపికల వివాహానికి మరియు ఖమ్మం నగరానికి చెందిన ధనియాకుల వెంకటేశ్వర్లు- అచ్చమ్మల కుమారుడు సాయి ప్రసాద్, శ్రీ నవ్య ల వివాహ కార్యక్రమాలలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి, నిండు నూరేళ్లు పచ్చని సంసారాలతో, కళకళలాడాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు చింటూ మంద రాములు లక్కు బాసు, బొడ్డు లక్ష్మీనారాయణ, ఆలోతు శివ కవిరాజు భత్తుల వీరబాబు, చల్ల మల్లయ్య మున్నా భాస్కర్ దేరంగుల రామారావు దేరంగుల తిరపయ్య, చల్ల నాగేశ్వరరావు తిరుమల కొండ బాబు దండగల దేవేంద్ర, చెన్ను వెంకటయ్య, మల్లె బోయిన శ్రీను బి హనుమంతరావు, వధూవరుల బంధుమిత్రులు పాల్గొన్నారు

## గుడిసె వాసులకు ఇంటినంబర్లు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి : సిపిఎం

**తొలిసమయం, ఇల్లందు. ఏప్రిల్, 20.**
ఇల్లందు పట్టణం, మండలంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న దేవులపల్లి యాకయ్య నగర్, సున్నం రాజయ్య నగర్, మల్లు స్వరాజ్యం నగర్ గుడిసె వాసులకు ఇంటి నంబర్ల కేటాయించాలని ఇతర మౌళిక సౌకర్యాలు కల్పించాలని,జెకే ఓసి నిర్వాసితులకు ఇచ్చిన క్వార్టర్స్ కూల్చివేత నిలిపివేయాలని,పైలట్ గ్రామమైన పూబెల్లి లో ఇందిరమ్మ ఇండ్లు రానివారికి ఇవ్వాలని మంచి నీరు, ఇంటి స్థలం, రేషన్ కార్డులు,విద్యుత్ మీటర్లు వంటి ఇంటింటి సర్వే లో వచ్చిన సమస్యలపై జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రంను సిపిఎం ఇల్లందు మండల కమిటీగా ఈ రోజు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతు వినతిపత్రం లో పేర్కొన్న సమస్యలపైన కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించ్చారని నిర్వాసితులకు ఇంటి స్థలం, ఇందిరమ్మ నిర్మించి ఇస్తామని, గుడిసె వాసులపట్ల స్థానిక తహసీల్దార్ కు సర్వే నిర్వహించాలని ఆదేశించ్చారని, ఇందిరమ్మ ఇండ్లు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారని పేర్కొన్నారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, వజ్జా సురేష్, లతో పాటు గుడిసె వాసులు, నిర్వాసితులు ఉన్నారు.



## భూభారతితో సమస్యలు పరిష్కారం

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**



**తొలి సమయం, ఇల్లందు, ఏప్రిల్,20**
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టం భూ భారతి తో రైతులకు సమస్యలకు పరిష్కారం చూపుతోందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు మండలం బజ్జాయిగూడెం పంచాయతీలో ఎస్ ఎస్ గార్డెన్ నందు భూ భారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు, భూ సంబంధిత సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, అటువంటివి తలెత్తకూడదనే, ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చింది అని అన్నాడు. భూ సమస్యలు, మార్పులు చేర్పులు, మ్యుటేషన్ ఇతర సమస్యలకు ఈ భూభారతి చట్టం పరిష్కారం చూపుతోంది అని అన్నారు. ఈ చట్టం రైతులకు మాత్రమే కాదని, ఆఫీసర్లకు కూడా ధైర్యం ఇచ్చిందని అన్నారు. సమస్య ఎంత తీవ్రమైనదైనా నాలుగు అంచల్లో పరిష్కారం లభిస్తుంది అన్నారు.ఈ చట్టం పై రైతులు, ప్రజలు అవగాహన కల్పించేందుకే సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఎమ్మెల్యే తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు, డి ఎల్ పి ఓ రమణ, తాసిల్దార్ తోట రవికుమార్, ఎంపీడీవో దల్ సింగ్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఇల్లెందు మండల రైతులు, మండల మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు, మండల నాయకులు,పట్టణ నాయకులు, యువజన విభాగం మహిళా విభాగం ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ స్పౌజ్ ట్రాన్స్ఫర్లను రద్దు చేయాలి

**అది కారులను భయబ్రాంతులకు గురిచేస్తూ తప్పు దోవ పాంట్టించే అర్హత లేని అభ్యర్థుల పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి**

**నిజమైన 317 బాధితులకు న్యాయం చెయ్యాలి**

**డిటిఎఫ్ డిమాండ్.**

**తొలి సమయం మహబూబాబాద్ ఏప్రిల్ 20:**



అక్రమ స్పౌజ్ ట్రాన్స్ఫర్ లను రద్దు చేయాలని మహబూబాబాద్ జిల్లా శాఖ డిటిఎఫ్ కమిటీ ఓ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసింది, డీ టీ యఫ్ తెలిపిన వివరాల ప్రకారం 317 సమయంలో ఒకే ఉమ్మడి జిల్లాకు చెంది వేర్వేరు జిల్లాలకు అలాట్ అయిన భార్యాభర్తలని ఒకే జిల్లాకు చేర్చాలని ఉద్దేశంతో ప్రభుత్వం వారి దరఖాస్తులు స్వీకరించింది. డిసెంబర్ 2021 మరియు జనవరి 2022 లలో ఈ బదిలీలు జరిగినాయి, కావున అప్పుడు భార్య భర్తల్ని ఒకే జిల్లాకి చేర్చడం కోసం దరఖాస్తులు స్వీకరించి సాధ్యమైనంత మేరకు ఖాళీలు ఉన్న మేరకు ఒకే జిల్లాకు పంపడం జరిగింది. తదుపరి ఈ లిస్టులో మిగిలిన వారిని రెండో విడతలో పంపుట కొరకు 317 అలాట్మెంట్ సమయంలో అర్హత ఉండి అప్లై చేసుకున్న వారి నుండి జీవో 243 నిబంధనల ద్వారా మరోసారి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఇదే అదనుగా 317 సమయంలో ఒకే జిల్లాలో ఉండి రూరల్ జిల్లాలలో ఉండడం ఇష్టం లేక వారి స్పౌజ్ లు బదిలీల ద్వారా అర్బన్ జిల్లాలకు వెళ్ళి తమ భర్త లేదా భార్య ను కూడా అర్బన్ జిల్లాలకు పంపండి అని అధికారులను ఒత్తిడి చేస్తున్నారు. అభ్యర్థులకు %+ూ.317 డ +ూ%.243 నియమ నిబంధనల ప్రకారం వారు అనర్హులని తెలిసినప్పటికీ అధికారులను ప్రలోభాలకు గురి చేస్తూ అనేక రకాల ఒత్తిడిలకు గురి చేస్తున్నారు. ఇలా అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తు, తప్పుదోవ పట్టిస్తున్న అభ్యర్థులపై శాఖ పరమైన చర్యలు తీసుకొని నిజమైన 317 బాధితులకు న్యాయం చేయగలరని డిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ భాస్కర్ మరియు టి దేవేందర్ రాజు జిల్లా విద్యాశాఖ అధికారి కి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈసాల లక్ష్మయ్య మండల రాజు కుమారస్వామి మరియు సుధాకర్ గార్లు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 20**



జిల్లాలో వచ్చే రెండు రోజులు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణం శాఖ సూచించిన మేరకు రైతులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచన ప్రకారం జిల్లాలో ఈరోజు రేపు అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నదని జిల్లాలోని రైతులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అప్రమత్తంగా ఉంటూ ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవరుతో కప్పి ఉంచి ధాన్యం రాశి చుట్టూ గాటు తీసి తడవకుండా చర్యలు తీసుకొవాలని కలెక్టర్ సూచించారు.

## సరోజన మరణించడంతో కుటుంబాన్ని పరామర్శించిన 47వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు



**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 20**
47వ డివిజన్ బోడగుట్ట చెందిన మేక మల్ల సరోజన ఇటీవలనే మరణించడం జరిగింది వారి కుటుంబాని పరామర్శించిన 47డివిజన్ కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబానికి బియ్యం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో 47 వ డివిజన్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి యువసేన టీం సభ్యులు డివిజన్ అధ్యక్షులు షేక్ అస్గర్ మైసరపు సీరిల్ లారెన్స్ ఇప్ప శ్రీకాంత్ దొంగల కుమారస్వామి సిలువేరు విజయభాస్కర్ ఎండి మదర్ ఎండి అలీ భాయ్ మరియు వారి కుటుంబ సభ్యులు మేక మల్ల విష్ణ మేకమల్ల బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడిగా పొదెం వీరయ్య నే కొనసాగించాలి

**కొత్తగూడెంలో మండల, అనుబంధ సంఘాల అధ్యక్షుల సమావేశం**



**తొలిసమయం, కొత్తగూడెం ఏప్రిల్ 20 :**
భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షులు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ను డీసీసీ అధ్యక్ష పదవి నుండి తప్పించి వేరే వారికి ఆ పదవి ఇస్తున్నారనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో భద్రాద్రి జిల్లా నలుమూలల నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల జిల్లా మండల స్థాయి అధ్యక్షులు కొత్తగూడెం ఉర్దూఘర్, షాదీఖానాలో సమావేశమాయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడైన పొదెం వీరయ్య పార్టీ జిల్లా అధ్యక్ష పదవి చేపట్టక ముందు నుండే కాంగ్రెస్ వాదిగ ఉన్నారని పార్టీ ఆదేశాల మేరకు సిట్టింగ్ స్థానం వదిలి భద్రాచలంలో పోటీ చేసిన నిఖార్సైన మనిషిన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడ్డ గిరిజన ఆదివాసీ ముద్దుబిడ్డ పొదెం వీరయ్య డీసీసీ భాద్యతలు చేపట్టిన తర్వాత అధికార టిఆర్ఎస్ పార్టీ ని నాయకులు కార్యకర్తలతో మమేకమై ఎలా ఎదుర్కొన్నారో అందరికి తెలుసన్నారు. ఆయన పార్టీ భాద్యతలు చేపట్టినప్పుడు పార్టీ పరిస్థితి ఎలా ఉందొ నేడు ఎలా ఉందొ చూసి మళ్ళీ ఆయనకే డీసీసీ పదవి ఇవ్వాలని తద్వారా పార్టీలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు లబ్ది చేకూరే అవకాశం ఉందన్న విషయాన్ని వారు స్పష్టం చేశారు.



## ఘనంగా ఈద్ మిలాప్

**తొలిసమయం, కొత్తగూడెం ఏప్రిల్ 20 :**



ఏ.ఎస్.జె కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అహ్లే సున్నత్ వల్ జామత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఈద్ మిలాప్' సందర్భంగా ముస్లిం మత పెద్దలు, పట్టణంలోని పలువురు ప్రముఖులు పాల్గొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పండుగ అనంతరం ముస్లిం పెద్దలంతా ఒకచోట కలసి నిర్వహించుకునే పండుగ ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని కమిటీ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రస్తుతం జరుగుతున్న పరిణామలు దృష్టిలో ఉంచుకుని ముస్లిం వర్గానికి గడ్డుకాలం వస్తే అందరం సమిష్టిగా పోరాడి ముస్లింల హక్కులను హరించాలని చూస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని, ఎన్ని అవాంతరాలు వచ్చిన పార్టీలకు అతీతంగా కలిసి ఉండాలన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడం ప్రజా పాలనకు నిదర్శనం

**మంత్రి కొండా సురేఖ**



**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 20**
ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజా ప్రభుత్వం పాలనకు నిదర్శనమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.మంత్రి కొండా సురేఖ హనుమకొండ రామ్ నగరులో తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు రాంనగర్ లోని తమ నివాసానికి చేరుకుని తమ సమస్యలను మంత్రి కొండా సురేఖకి విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి కొండా సురేఖ సహృదయంతో విని సంబంధిత పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని కొండా సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎవరు ధైర్యపడవలసిన అవసరం లేదని బడుగు, బలహీన వర్గాలజీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని మంత్రి కొండా సురేఖ భరోసానిచ్చారు.

# చార్లీ చాప్లిన్ 136 వ జయంతి వేడుకలు

**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 20**
హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్స్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో రోజా ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చార్లీ చాప్లిన్ 136 వ జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ , హన్మకొండ జిల్లా భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతులేని కష్టాలు , తినడానికి తిండి కూడా లేనంత పేదరికం ఉన్నా , తనను తాను ఈ ప్రపంచానికి నవ్వుల నటుడిగా పరిచయం చేసుకున్న ఘనత చార్లీ చాప్లిన్ ది అన్నారు.మాటల్లేని చిత్రాల్లో తన హావభావాలతోనే నవరసాలను పండించి వీక్షకులకు ఆనందామృతాన్ని పంచాడని, ఆనందం అనుభవించేందుకు మనసు భాష వస్తే చాలని నిరూపించి ఈ ప్రపంచానికి నవ్వులరాజుగా చెరిగిపోని జ్ఞాపకమయ్యాడని అన్నారు. తాను మరణించి దాదాపు 50 ఏళ్లు అయినా నవ్వుల రారాజుగా పేరొందాడని అటువంటి చార్లీ చాప్లిన్ జయంతి ని వరంగల్ కేంద్రంగా గత కొన్ని సంవత్సరాలుగా



నిర్వహిస్తున్న రోజా క్రియేషన్స్ సంస్థ నిర్వాహకుడు శ్యామ్ ను అభినందించారు.అనంతరం కార్యక్రమం లో తమ నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులను సన్మానించారు.

## వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 20**
వరంగల్ తూర్పు నియోజకవర్గం పుప్పాలగుట్ట మరియు 29వ డివిజన్ లోని రామన్నపేటలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం భోజన వితరణ కార్యక్రమంలో భాగంగా పలువురికి స్వయంగా భోజనాన్ని వడ్డించిన మంత్రి కొండా సురేఖ ఈ సందర్భంగా పాస్టర్లు క్రైస్తవుల పవిత్ర మత గ్రంథమైన బైబిల్ ను మంత్రికి బహూకరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం ప్రవచించిన లౌకికవాద స్ఫూర్తితో సర్వమానవ సమానత్వం అనే భావనను అంతఃకరణ శుద్ధితో అమలు చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దళిత క్రిస్టియన్లకు ఎంతో ఊరటనిస్తున్నాయని మంత్రి తెలిపారు.



# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

**- దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి - మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి**



**న్యూఢిల్లీ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడుయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోడీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణలతో పాటు రాజకీయనేతలో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది.

విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు ఇప్పటికైనా స్పందించాలి. మోడీ విధానాలకు తందానా అనకుండా అంతర్గగత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101